క్లుప్తంగా

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



రహదారి పనులు ప్రారంభించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో రూ.2 లక్షల 70 వేల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనులను సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జువరపు తాతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎలికే నాగలక్ష్మి, పారేపల్లి నాగార్జున, జుజ్జువరపు పెంటయ్య, వసంతాటి సతీష్, జుజ్జువరపు శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి రాజా, పోల్నాటి నాని, చిన్నరాజ, బల్లే రామచంద్రం పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి



కొమ్ముగూడెంలో సీసీ రహదారి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చింతలపూడి: గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మండల పరిషత్ అధ్యక్షుడు డా బి రాంబాబు నాయక్ అన్నారు. మండలంలోని రేచర్ల పంచాయితీ, కొమ్ముగూడెం గ్రామంలో రూ.10 లక్షల మహాత్మాగాంధీ ఉపాధి హామీ నిధులతో సీసీ రహదారి నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సర్పంచ్ కె.శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రావి ఆకులో బాపూజీ



కామవరపుకోట: విద్యార్థులు చదువుతో పాటు లీఫ్ ఆర్ట్ వంటి కళల్లో ఈ కళలో సృజనాత్మకతను పెంపొందించుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు ప్రోత్సాహంతో, తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగట్ల నాగేశ్వరరావు శిక్షణలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు కళాకృతులను చెక్కి అబ్బురు పరుస్తున్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం రావి ఆకులో మహాత్మా గాంధీ కళాకృతుని చెక్కి పలువురిని ఆకట్టుకున్నారు.

మానవత ఆర్థిక సహాయం

కామవరపుకోట: గాంధీ జయంతిని పురస్కరించుకొని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రామన్నపాలెంలోని వృద్ధులకు ఆర్థిక సహాయం అందజేశారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని వృద్ధులకు, వికలాంగులకు బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.14 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు ఆరోగ్య పరీక్షలు

లింగపాలెం: స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని పారిశుధ్య కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని జగనన్న స్వచ్ఛ సంకల్పంలో పనిచేస్తున్న క్లాప్ మిత్రలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, క్లాప్ మిత్రలు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ ఎం.వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ వి హరినాథ్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు, లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ రిక్షాల అందజేత



చెత్త సేకరణ రిక్షాలను అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి : పరిసరాల పరిశుభ్రతతో పాటు సమాజ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతా రామాంజనేయ చౌదరి అన్నారు. చింతలపూడి నగర పంచాయతీకి రూ.1.80 లక్షల వ్యయం కాగల ఆరు చెత్త సేకరణ రిక్షాలను సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరిసరాల పరిశుభ్రత కోసం నగర పంచాయతీ కమిషనర్ చేసిన విజ్ఞప్తి మేరకు చెత్త సేకరణ రిక్షాలను అందించినట్లు తెలిపారు. నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి కిషోర్ పాల్గొన్నారు.

పింఛన్ అందజేత

జంగారెడ్డిగూడెం రూరల్: గ్రామ వలంటీర్లు తమ సేవలతో ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. గురవాయిగూడెం గ్రామానికి చెందిన మారిశెట్టి వెంకటరావుకు కిడ్నీ ఆపరేషన్ జరిగడంతో నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో తమ బంధువుల ఇంటి వద్ద ఉంటున్నారు. వలంటీర్ చుక్కా భువనేశ్వరీ పింఛన్ నగదును తాడిమళ్ల వెళ్లి అందజేయడంతో లబ్ధిదారుడు వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం



జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ కార్యాయలంలో మహాత్మునికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, నాయకులు



జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జెడ్పీటీసీ బాబ్జి



కొయ్యలగూడెం: గణేష్ సెంటర్లో బాపూజీకి వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి



పోలవరం రూరల్: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

జంగారెడ్డిగూడెం: సమాజంలోని రుగ్మతలను పారద్రోలడానికి గాంధీ మార్గం ఒక్కటే సమాధానమని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత గాంధీజీ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. అహింసా అనే ఆయుధంతో స్వాతంత్రోద్యమం తీవ్రతను బ్రిటిష్ పాలకులకు తెలియజేశారని పేర్కొన్నారు. గాంధీజీ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజాతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ కంచర్ల వాసవి, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్‌లు ఎల్‌వీఆర్, నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, కటారి వాసు, దొంతు మాధవ్, తడికిమళ్ళమురళి తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక ఏరియా ఆసుపత్రిలో హెచ్‌డీఎస్ మెంబెర్ రాపోలు బావనరుషి, ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల, వైద్యులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.

● స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వాసవీక్లబ్ ఇంటర్‌నేషనల్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, దారా శ్రీనివాసరావు, చిట్టూరి తేజ, చిట్టూరి రాజేశ్వరి పాల్గొన్నారు.

● స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో హెచ్‌ఎం లోవకుమారి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

శాంతియుత జీవనాన్ని కొనసాగించాలి

లింగపాలెం: ప్రజలు గాంధీ మార్గంలో నడిచి శాంతియుత జీవనం సాగించాలని ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం లింగపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, సర్పంచ్ తరగం హేమలత, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆర్‌వీ మురళీకృష్ణ, సిబ్బంది, వీఆర్వోలు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మాజీగూడెంలో వాసవీక్లబ్, ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాంధీజీకి నివాళులు

కామవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. కామవరపుకోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కరిపోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు ఆధ్వర్యంలో, తడికలపూడిలో జెడ్పీటీసీ కడిమి రమేష్ ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. తడికలపూడి సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఉప సర్పంచ్ కోల విష్ణు, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, రాష్ట్ర ముదిరాజ్ సంఘ చిక్కుళ్ళ శ్రీను, సొసైటీ చైర్మన్ సాయన్న కనకరాజు పాల్గొన్నారు.

వాడవాడలా గాంధీ జయంతి

కొయ్యలగూడెం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. గణేష్ సెంటర్లోని గాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు సంకుకొండ, తిరువూరు శ్రీనివాస్, పల్లంట్ల శ్రీను, గొలిసెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయం, గవర్నమెంట్ హాస్పిటల్, బస్టాండ్ ప్రాంగణంలో గాంధీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు.

గాంధీజీ ఆశయ సాధనలో పయనించాలి

జంగారెడ్డిగూడెం రూరల్: మహాత్మా గాంధీ ఆశయ సాధనలో ప్రతిఒక్కరూ పయనించాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. శ్రీనివాసపురంలో గాంధీజీ చిత్రపటానికి జెడ్పీటీసీ బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జువరపు తాతారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ బాబ్జి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవిత చరిత్రను నేటి యువత తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు.

టి.నరసాపురం: గాంధీ జయంతి వేడుకలు మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. టి.నరసాపురంలో మెయిన్ రోడ్డు పక్కన ఉన్న గాంధీ విగ్రహానికి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తిరుమలదేవిపేటలో గాంధీ విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు రామలింగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బొర్రంపాలెంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్, వాసవీ వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. టి.నరసాపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో స్వీట్లు పంపిణీ చేశారు.

గాంధీజీ పోరాటం స్ఫూర్తిదాయకం

కుక్కునూరు: స్థానిక డంపింగ్ యార్డ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ రావు మీనా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రావు వినోద్, ఎం.చంటినాయుడు, సూర్ల రాము, పగిళ్ల అల్లేష్, కుక్కునూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ పాల్గొన్నారు.

హింసా మార్గాన్ని విడనాడాలి

చింతలపూడి: పట్టణంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు స్థానిక సబ్‌జైల్లో ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. ప్రతిఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాకర్ల మాణిక్యాలరావు, బుల్లాసుపాదం, మీసాల రమేష్, సుందర్రావు, ఎండీ అక్బర్ అలి, జైల్ సూపరింటెండెంట్ జి వెంకటేశ్వరరావు, హెడ్ వార్డర్ డి సాంబశివరావు, సబ్‌జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం



బుట్టాయగూడెంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: శాంతి, సమానత్వం అనే సిద్ధాంతాలతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గొప్ప వ్యక్తి గాంధీజీ అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెంలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ సీఎం వైఎస్ జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. గాంధీజీ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తి దాయకమని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కరాటం కృష్ణస్వరూప్, ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే బాజీ, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు బన్నే బుచ్చిరాజు, కుంజా వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి మార్గంలో పయనించాలి



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్

ద్వారకాతిరుమల: మహాత్ముని శాంతి మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అహింస అనే ఆయుధంతో బ్రిటీష్ సామ్రాజ్యాన్నే గాంధీజీ గడగడలాడించారని, బానిస సంకెళ్ల నుంచి దేశానికి విముక్తి కలిగించి చరిత్రలో నిలిచారని కొనియాడారు. తొలుత మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీవో తిరుపతిరావు, ఎస్సై టి.సుధీర్ పాల్గొన్నారు.



కామరవపుకోట: తడికలపూడిలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జెడ్పీటీసీ రమేష్



లింగపాలెం: గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ హరినాథ్‌రాజు



టి.నరసాపురం: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



కుక్కునూరు: గాంధీజీకి నివాళులర్పిస్తున్న సర్పంచ్ రావు మీనా తదితరులు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



గంగవరం సచివాలయం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సచివాలయ సిబ్బంది

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు క్షీరాభిషేకం నిర్వహించారు. రాజవరం పంచాయతీ గంగవరం గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ, సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, ఎంపీటీసీ కొండేపాటి చింతయ్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల వ్యవస్థ ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిపట్ల సోమేశ్వరరావు, వూస దామోదరం, బల్లే కేసు బాబు, చింతా రామారావు, చిన్నం శెట్టి సత్యనారాయణ, ఈడుపు గంటి తాతారావు, వుండి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: గ్రామ స్వరాజ్యం కోసం సచివాలయ వ్యవస్థను స్థాపించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ముందుగా వారంతా జగనన్నకు వందనం పేరుతో కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ షబ్బీర్‌తో కలసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పులువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నిరుద్యోగులమైన తమకు ఉపాధిని కల్పించిన మహోన్నతుడు సీఎం జగనన్న అని కొనియాడారు.

పోలవరం గెలుపును జగన్‌కు కానుకగా ఇవ్వాలి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: రాబోయే ఎన్నికలు ఒక యుద్ధం లాంటివని, పోలవరంలో వైఎస్సార్ సీపీని గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. స్థానిక సొసైటీ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు రావాలంటే అనే కార్యక్రమంపై, వైఎస్సార్‌సీపీ సచివాలయ శిబిరాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడచిన నాలుగేళ్ల నాలుగు నెలల కాలంలో ఎలాంటి లంచాలు, అవినీతికి తావులేకుండా ప్రతిఇంటికీ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్దపీట వేయడంతోపాటు మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించారని, ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు గిరిజన మహిళలకే కేటాయించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సైనికుల్లా పనిచేయాలన్నారు.

లంచాలు తీసుకుని..
కంచాలు కొట్టడమేమిటో?

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో కచ్చితమైన ఆధారాలతోనే చంద్రబాబు జైలుకు వెళ్లారని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. లంచాలు తీసుకుని కంచాలు కొట్టడమేమిటో అర్థం కావడంలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాష్ట్ర యువతను మోసం చేశారని అన్నారు. స్కామ్ చేసిన చంద్రబాబుకు కొందరు మద్దతు ఇస్తున్నారని వారంతా వచ్చే ఎన్నికల్లో ఒక్కటై వైఎస్సార్‌సీపీని ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. టీడీపీ, జనసేన కుట్ర రాజకీయాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అందుకు సోషల్ మీడియాను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కరాటం కృష్ణస్వరూప్, ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే బాజీ, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు బన్నే బుచ్చిరాజు, కుంజా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సోడెం సుధాకర్, తెల్లం దుర్గారావు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలి

టి.నరసాపురం: సనాతన ధర్మంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని, మతమార్పిడులను, ప్రతి ఒక్క హిందూ స్వాభిమానంతో ప్రతిఘటించాలని శౌర్య జాగరణ యాత్ర కన్వీనర్ వేదుల జనార్ధనరావు పిలుపునిచ్చారు. మక్కినవారిగూడెంలో సోమవారం విశ్వహిందూ పరిషత్తు, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్రలో భాగంగా హిందూ ధర్మ సంస్కృతి, సనాతన ధర్మ విశిష్టత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాలెంపాటి హరిబాబు, శ్యాంసుందర్‌రావు, జిల్లా భజరంగ్‌దళ్ సంయోజక్ బొంతు నాగరాజు, కిషోర్, దామిశెట్టి కేశవరావు, కట్రెడ్డి సురేంద్ర పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం రూరల్: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన బాలిక ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుంటుంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన ఈశ్వర్ తులసితో పరిచయం ఏర్పడింది. ఈనెల 30న ఈశ్వర్ తులసి బాలికను ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లు బాలిక తల్లికి స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

4, 18 తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఈ నెల 4, 18 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.భవానీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హరిజనపేట యూపీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 4వ తేదీ ఉదయం 9 నుంచి 5 గంటల వరకు ఏలూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే డాంగేనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 18న స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. తుములూరుకు చెందిన అల్లం బసిరెడ్డి ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

గ్రామాలు అభివృద్ధి చెందాలి

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ గెల్లా వెంకట రమణ మాట్లాడుతూ రహదారులు, డ్రెయినేజీల్లో వ్యర్థాలు వేయరాదని సూచించారు. 2024–2025 సంవత్సర అంచనాల బడ్జెట్‌ను కార్యదర్శి పగడం నాగేశ్వరరావు ప్రవేశపెట్టగా గ్రామ సభ ఆమోదించింది. ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు. వేగవరంలో సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు బిరుదు గడ్డ నాగేశ్వరరావు, బుట్టాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జువాలజీ సబ్జెక్టు పీజీటీ గుర్రం గంగాధరరావు, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వేగవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తలారి అమృత రావులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీటీఏ మండల ప్రధాన కార్యదర్శి కనపర్తి రాజా అధ్యక్షత వహించారు.

దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి దివ్యసన్నిధిలో ఈనెల 15 నుంచి నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ చైర్మన్ వాగ్వాల పుల్లారావు ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ సోమవారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.